క్లుప్తంగా

వేపనూనెను పిచికారీ చేయండి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్

పెద్దకడబూరు: వేరుశనగ పంటలో పైరు తొలి దశలో ఉండగా వేపనూనెను పిచికారీ చేసుకోవడం వల్ల రెక్కల పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ సూచించారు. మండల పరిధిలోని కంబదహాల్ గ్రామ పరిధిలోని వేరుశనగ పంటలో సోమవారం పొలంబడి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంట చుట్టూ కంచె పంటగా మూడు వరసలు సజ్జ/జొన్న సాగు చేసుకోవాలన్నారు. దీని ద్వారా రసం పీల్చే పురుగుల ఉధృతిని తగ్గించవచ్చన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆదోని రూరల్: మట్టి, గులక రాళ్లు ఉన్నాయన్న సాకుతో దిగుబడులను చిందరవందర చేసి రైతులను ఇబ్బంది పెట్టొద్దని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కె.లక్ష్మిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు అజయ్‌బాబు, ఏపీ రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు బి.నరసప్ప, బి.యల్లప్ప తదితరు కోరారు. సోమవారం స్థానిక మార్కెట్‌యార్డు కార్యదర్శి, చైర్మన్‌కు వారు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్.సుదర్శన్, ఏఐటీయూసీ నియోజవర్గ అధ్యక్షులు బి.వెంకన్న పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత వైద్యశిబిరం



పిల్లలను పరిశీలిస్తున్న వైద్యులు

ఆదోని అర్బన్:పట్టణంలోని సి.మల్లికార్జున విద్యాలయంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దివ్యాంగులను పరీక్షించి కొందరికి ఉపకరణాల అవసరమని నిర్ధారించారు. ఆర్టిఫిషియ ల్ లిమ్బ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ (ఏఎల్‌ఐఎంసీఓ), అలిమ్కో కాన్పూర్ సహకారంతో వాటిని అందజేస్తానమి ఎంఈఓ శివరాము లు, ఐసీ కో ఆర్డినేటర్ విజయప్రసాద్‌రావు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కో ఆర్డినేటర్ వాణి,ఐఈఆర్‌పీలు, స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్‌అసిస్టెంట్లు,ఫిజియోథెరపిస్టులు పాల్గొన్నారు.

ఎస్ఈఐఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సోమన్న



పెద్దకడబూరు: స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్(ఎస్ఈఐఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడిగా తనను ఎంపిక చేశారని మండల పరిధిలోని హెచ్.మురవణి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, బాలసాహిత్య వేత్త గద్వాల సోమన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.తనపై నమ్మకంతో బాధ్యతలు ఇచ్చిన ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఈదా శామ్యూల్‌రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



బస్సమ్మ(ఫైల్)

కౌతాళం:మండల పరిధిలోని బదినేహాల్ గ్రా మ మాజీ సర్పంచ్ బస్సమ్మ (90) సోమవారం మృతి చెందారు. ఈమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గతంలో ఐదేళ్లపాటు సర్పంచ్‌గా గ్రామానికి సేవ చేశారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ తుది శ్వాస విడిచారు.

పోస్టాఫీసులో సొమ్ము భద్రం

ఆలూరు: తపాలా శాఖ ప్రవేశ పెట్టిన పథకాలలో పొదుపు చేస్తే కచ్చితమైన రాబడితో భవిష్యత్తుకు అండగా నిలుస్తుందని ఎస్‌పీఎం రంగన్న అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన సోమవారం మాట్లాడుతూ.. ఆకర్షణీయ బ్రోచర్లు, ప్రకటనలు, అధిక వడ్డీకి ఆశపడి బోగస్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోవద్దని సూచించారు. తపాలా శాఖ అందిస్తున్న పథకాలతో పక్కా ఆదాయం ఉంటుందని, 7 ముఖ్యమైన పథకాలు ఉన్నట్లు వివరించారు. టాటా బీమా పాలసీలో ఒకేసారి రూ.339 చెల్లిస్తే రూ.10 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. అలాగే సుకన్య సమృద్ధి యోజన, పీఎఫ్‌పీ స్కీమ్, ఆర్డీ (రికరింగ్ డిపాజిట్) ఎస్‌బీలు, టీడీ (టైమ్ బాండు) డిపాజిట్లు, ఎన్ఎస్‌సీ (నేషనల్ సేవింగ్స్ స్కీమ్), కిసాన్‌వికాస్ పత్ర (కేవీపీ) పథకాల ద్వారా దీర్ఘకాలికంగా మంచి రాబడి పొందవచ్చని వెల్లడించారు.

☛ ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ప్రసాద్ ఎంబీఏ పూర్తి చేసి ఉద్యోగం రాలేదని మనస్తాపానికి గురై నగరూరు గ్రామ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. 'అమ్మా, నాన్నా నన్ను క్షమించండి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదివించినా నేను జీవితంలో విఫలమయ్యాను' అని ఉత్తరంలో పేర్కొన్నాడు. తమ బిడ్డ కడుపుకోత మిగిల్చి వెళ్లిపోయాడని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

☛ ఆదోని మండలం అలసందిగుత్తి గ్రామానికి చెందిన చిన్నఈరన్న.. తన భార్య ఘర్షణ పడి పుట్టింటికి వెళ్లిందని, తిరిగి రాలేదని మనస్తాపానికి గురై పురుగు మందు తాగి లోకాన్ని వీడాడు. అటు భార్యకు ఇటు తల్లిదండ్రులకు పుట్టెడు శోకం మిగిల్చి వెళ్లాడు. ఇలాంటి ఘటనలు రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళనకరం.

☛ బాగా చదవలేకపోతున్నామని, ప్రేమలో విఫలమయ్యామని, తల్లిదండ్రులు మందలించారని, ఉద్యోగం రాలేదని కారణాలు ఏవైనా కొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తమ సమస్యలను పరిష్కరించుకోలేక, సమాజాన్ని ఎదురించి పోరాడలేక క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తమ తల్లిదండ్రులకు కడుపుకోత, కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగిల్చి వెళ్తున్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఇతరులతో పంచుకోకుండా, పరిష్కారమార్గాలు వెతుక్కోకుండా విలువైన ప్రాణాలను బలి తీసుకుంటున్నారు. ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని పోలీసులు అవగాహన కల్పిస్తున్నా కొందరు క్షణికావేశంలో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

క్షణికావేశం... తీరనిశోకం

- ఆదోని పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో 265 మంది ఆత్మహత్యలు
- ఆత్మహత్యలకు కారణం ఆర్థిక, అనారోగ్యం, వివాహేతర, ప్రేమ, కుటుంబ కలహాలు
- బలవన్మరణమే సమస్యలకు పరిష్కారం కాదంటున్న నిపుణులు

ఆదోని అర్బన్: ఆదోని పోలీస్ సబ్‌డివిజన్‌లో ఆత్మహత్యల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. 2022 జనవరి నుంచి ఈ యేడాది జనవరి వరకు 265 ఆత్మహత్యల కేసులు నమోదు కావడం ఆందోళనకరం. 2022 జనవరిలో 17 మంది, ఫిబ్రవరిలో 17, మార్చిలో 19, ఏప్రిల్‌లో 23, మేలో 24, జూన్‌లో 14, జూలైలో 23, ఆగస్టులో 25, సెప్టెంబర్‌లో 22, అక్టోబర్‌లో 29, నవంబర్‌లో 11, డిసెంబర్‌లో 24, ఈ యేడాది జనవరిలో 17 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. అధికశాతం ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, అనారోగ్య సమస్యలే ఆత్మహత్యలకు కారణంగా తెలుస్తోంది.

మరింత అవగాహన అవసరం..

ఆత్మహత్యలే సమస్యలకు పరిష్కారం కాదని నిపుణులు చెబుతున్నారు. జీవితంలో కష్టాలు, సుఖాలు సర్వసాధారణం. సుఖాలను ఏవిధంగా స్వీకరిస్తామో, కష్టాలను అదేవిధంగా ఎదుర్కొన్నప్పుడే విజయం సాధ్యం .బలవంతంగా ప్రాణాలు తీసుకున్న మాత్రానా ఎలాంటి ఫలితం ఉండదు. ఆత్మహత్యలను నివారించాలంటే పోలీసులతో పాటు స్వచ్ఛంద సంస్థలు, మారుమూల గ్రామాల్లో సైతం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఆత్మహత్యల వల్ల వారి కుటుంబాలు రోడ్డున పడతాయనే విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.



రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న యువకుడు (ఫైల్)

నిరాశలో ఉన్న వారిని గమనించాలి



నిరాశ చెంది ఎవరితో మాట్లాడకుండా ఒంటరిగా ఉండేవారిని గమనించాలి. వారితో కొంతసేపు మాట్లాడితే కష్టాలు చెబుతారు. వారికి ధైర్యం చెప్పాలి. పూర్వకాలంలో ఆత్మహత్యలు చాలా తక్కువ. నిరాశగా ఉన్న వారిని పెద్దలు గుర్తించి ధైర్యం చెప్పేవారు. ప్రస్తుతం ఒకరిని చూసి మరొకరు అన్నట్లు ఆత్మహత్యకుల పాల్పడతున్నారు.

– గోపీనాథ్, ప్రముఖ వైద్యనిపుణులు

సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదు



సమస్యలు అందరికీ ఉంటాయి. ఆత్మహత్య పరిష్కారం కాదు. మానవ జన్మ ఓ వరం. అలాంటి జీవితాన్ని చిన్నచిన్న సమస్యలను ఎదుర్కోలేక ఆత్మహత్యలతో ముగించడం అర్థరహితం. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయం అనేక జీవితాలను ప్రశ్నార్థకంగా మారుస్తుంది. వారిని నమ్ముకున్న వారు అనాథలవుతారు. చిన్నప్పటి నుంచి కష్టం విలువ తెలిసేలా తల్లిదండ్రులు పెంచాలి. ఆత్మహత్యలు నివారించేందుకు కళాశాల, పాఠశాల, మారుమూల గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. వివాహేతర సంబంధాలు, ప్రేమ వ్యవహారాలు, ఆర్థిక పరమైన ఇబ్బందులు, అప్పులు, అనారోగ్య సమస్యలు, కుటుంబ సమస్యల కారణంతోనే చాలామంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

– వినోద్‌కుమార్, ఆదోని డీఎస్పీ

పట్టుదలతో చదివితే విజయం తథ్యం

గోనెగండ్ల: స్వేచ్ఛయుత వాతావరణంలో ప్రణాళిక బద్ధంగా చదివితే విజయం సొంతం అవుతుందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రామన్, జిల్లా కౌన్సిలర్ జిక్రియ మాట్లాడుతూ.. పదవ తరగతి విద్యార్థులకు సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. అలాగే త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు రోజు వారి ప్రణాళిక ప్రకారం చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మండలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రిన్సిపల్ షాహినా పర్వీన్, ఉపాధ్యాయులు రజాక్, చాంద్ బాషా, రాజశేఖర్, సునీత తదితరులు పాల్గొన్నారు.

కేవీకేలో మట్టి, సాగునీటి పరీక్షలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మట్టి, నీటి పరీక్షలు చేసుకునేందుకు అవకాశం ఉందని ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ పేర్కొన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. రైతులు తమ పొలంలోని మట్టి, నీటి సాంపిళ్లను తీసుకొని కేవీకేకు రావాలన్నారు. మట్టి నమునా పరీక్షల ద్వారా నేలలోని పోషకాల లభ్యత గురించి తెలుసుకోవచ్చని చెప్పారు. నేలలో ఉన్న సేంద్రియ కర్బణం, ఉదజని సూచిక, లవణ శాతం, నత్రజని, భాస్వరం, పొటాష్ మూలకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకోవచ్చునని వివరించారు. నేల ఆరోగ్య స్థితిని బట్టి ఏ పంటలు వేసుకోవాలి, ఎరువులు ఎంత మోతాదులో వాడాలనే వివరాలు తెలియ చేస్తామన్నారు. అలాగే నీటి పరీక్షల ద్వారా లవణ శాతం, ఉదజని సూచిక తదితర వివరాలు తెలుస్తాయన్నారు. మట్టి పరీక్షకు రూ.100 (ఒక శ్యాంపిల్‌కు), నీటి పరీక్షకు రూ.60 (ఒక శ్యాంపిల్‌కు) చొప్పున రైతులు చెల్లించాలన్నారు. శ్యాంపిల్ సేకరణలో సందేహాలుంటే 80741 43694 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

వక్ఫ్‌బోర్డు అధికారులదే నిర్లక్ష్యం



మాట్లాడుతున్న మసీదు ట్రస్టీ సాదీరావూఫ్

ఆదోని రూరల్: స్థానిక షాహీ జామియా మసీదుకు వక్ఫ్‌బోర్డు అధికారులు ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా తాము సిద్ధంగా ఉన్నామని, ఈ విషయంలో వక్ఫ్‌బోర్డు అధికారులే నిర్లక్ష్యం వహిస్తున్నారని జామియా మసీదు ప్రధాన ట్రస్టీ సాదీరావూఫ్, ట్రస్టీ శాషసాబ్ అన్నారు. సోమవారం మసీదు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మసీదుకు సంబంధించిన డబ్బు వాడుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. ప్రతినెలా దుకాణాల అద్దె ద్వారా రూ.3 లక్షలు వస్తే అందులో రూ.2.50 లక్షలు ఖర్చు ఉందన్నారు. గతంలో మసీదులో పనిచేసే వారికి రూ.3 వేలు జీతం ఉంటే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.8 వేలు ఇస్తున్నామన్నారు. కొత్తగా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలను ప్రారంభించి వారికి జీతాలు రూ.2 వేల నుంచి రూ.6 వేల వరకు పెంచి ఇస్తున్నామన్నారు. మసీదులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రతి నెలా ఆదాయం, ఖర్చు వివరాలు మసీదు బోర్డుపై వివరిస్తున్నామన్నారు. ఎవరికైనా వివరాలు కావాల్సి వస్తే మసీదు కార్యాలయంలో తెలుసుకోవచ్చన్నారు. మసీదు అభివృద్ధి కోసం పనిచేస్తున్నామే తప్పా తాము ఎలాంటి అవినీతికి పాల్పడలేదన్నారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఆదోనిటౌన్: తనను పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఆయన పార్టీ నాయకుడు మనోజ్‌కుమార్‌రెడ్డితో కలిసి పట్టణంలో ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

☛ మంత్రాలయం రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీగా వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి ఓటర్లను కోరారు. సోమవారం దుర్గారమణ కల్యాణ మండపంలో పట్టభద్రులతో సమావేశమై మొదటి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

☛ కోసిగి: వైఎస్సార్ సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డికి మొదటి ప్రాధాన్య త ఓటు వేసి గెలిపించాలని పార్టీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి కోరారు. చింతకుంట, పల్లె పాడు గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు.

☛ కౌతాళం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు.



కోర్టు ప్రాంగణంలో ఓటు అభ్యర్థిస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

క్రైం కార్నర్

సిలిండర్ పేలి బంకు దగ్ధం



పూర్తిగా దగ్ధమైన బంకు

మద్దికెర:స్థానిక కెనరా బ్యాంకు సమీపంలో ఓ హోటల్ బంకులో సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు గ్యాస్ సిలిండర్ పేలడంతో పూర్తిగా దగ్ధమైంది. దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితురాలు లక్ష్మిదేవి వాపోయారు. చిన్న హోటల్ పెట్టుకొని జీవనం సాగిస్తున్న లక్ష్మిదేవి రోజు మాదిరిగానే తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోయింది. అర్ధరాత్రి పెద్ద శబ్దం రావడంతో చుట్టపక్కల వారు చూసి మంటలను ఆర్పి వేశారు.

గడ్డివామి దగ్ధం



హొళగుంద: మండల పరిధిలోని లింగంపల్లి గ్రామ శివారులో సోమవారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివాము కాలి బూడిదైంది. దాదాపు రూ.50 వేలకు పైగా ఆస్తి నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన గొల్లరామన్న పాడి పశువుల కోసం కర్ణాటక నుంచి 2 ట్రాక్టర్ల వరిగడ్డి, 2 ట్రాక్టర్ల జొన్నచొప్పను కొనుగోలు చేసి పొలంలో గడ్డివాము వేసుకుని నిల్వ చేసుకున్నాడు. అయితే అగ్ని ప్రమాదంలో మొత్తం కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

క్షుద్రపూజల కలకలం



క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు

కృష్ణగిరి: పంట పొలాల సమీపంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేసినట్లు ఆనవాళ్లు కనిపించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎల్లా నాగిరెడ్డి చెరువు సమీపంలోని మల్లయ్య, తిమ్మగురుడు, లక్ష్మన్న రైతుల పొలాల సమీపంలో క్షుద్రపూజలు చేసినట్లు సోమవారం పొలాలకు వెళ్లిన రైతులు గుర్తించి గ్రామస్తులకు తెలియజేశారు. దీంతో ఆ చుట్టూ ప్రక్కల పొలాలు ఉన్న రైతులు భయాందోళన చెందుతున్నారు. పోలీసు అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లాభసాటి వ్యవసాయ పద్ధతులపై అవగాహన



రైతులకు సూచనలిస్తున్న జేడీఏ వరలక్ష్మి

ఆలూరు: సాగునీటి సదుపాయం ఉన్న రైతులు లాభసాటి వ్యవసాయంపై దృష్టి సారించాలని జేడీఏ వరలక్ష్మి సూచించారు. దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామంలో సోమవారం డీడీఏ వెంకటేశ్వర రెడ్డి సమక్షంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సదర్భంగా జేడీఏ మాట్లాడుతూ.. బోరుబావులు, కాలువల నుంచి సాగునీటి వసతి కలిగిన రైతులు పండ్ల తోటలు, ఆకుకూరలు, కూరగాయల పంటలను సాగుచేస్తూ లాభసాటి వ్యవసాయం వైపు దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జియాలజిస్టు ద్వారా రైతుల భూములలో సర్వే నిర్వహించిన తర్వాత వైఎస్సార్ జలకళ ద్వారా బోర్లను తవ్వించి డ్రిప్, స్ప్రింక్లర్లను మంజూరు చేస్తున్నామన్నారు. రైతులు కోళ్లు, మేకలు, గొర్రెలు, పాడి గేదెల పెంపకంపై దృష్టి సారించాలని, ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ మంజూరు చేస్తుందని వివరించారు. అనంతరం పశుసంవర్ధక శాఖ జేడీ రామచంద్రయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో సన్న, చిన్న కారు రైతులు పాడి గేదెల పంపకం చేపడితే ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ప్రధానంగా ముర్రా, జెర్సీ జాతుల పశువుల ఉత్పత్తిని పెంచుకోవడానికి అనేక రకాల వీర్యకణాల ఇంజెక్షన్లు (ఎద సూదులు) అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం రైతుకు ఒక యూనిట్ కింద 2 ఆవులు, 10 మేకలు, 20 కోళ్లు, పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కప్పట్రాళ్ల సర్పంచ్ చెన్నమ్మ నాయుడు, మండల కన్వీనర్ మల్లికార్జున, పత్తికొండ ఏడీఏలు విజయ్‌మోహన్‌కుమార్, సురేష్, ఏఓలు సురేష్ బాబు, చంద్రశేఖర్, ఏఈఏలు యోగేంద్ర, రంగన్న, జయరామ్, వీఏఏలు శివలింగ, రంగన్న, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతతకు భంగం కలిగించొద్దు

ఎమ్మిగనూరురూరల్: గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగించకుండా జీవనం సాగించాలని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం సూచించారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని మాస్‌మాన్‌దొడ్డి గ్రామంలో ట్రాపిక్ డీఎస్పీ నాగభూషణం, రూరల్ సీఐ కె.మోహన్‌రెడ్డి, ఎస్ఐ యు.సునీల్‌కుమార్ పల్లె నిద్ర నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామంలో చిన్నచిన్న విషయాలకు గొడవలకు వెళ్లకుండా పెద్దల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కుటుంబానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, పిల్లలను బాగా చదివించుకోవాలన్నారు.

బహుమతుల ప్రదానం

ఆలూరు: క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలని దేవనకొండ జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ సూచించారు. దేవనకొండలో దిగంబర దివాన్ మూగి తాత దర్గా 38వ ఉరుసు సందర్భంగా అంతర్రాష్ట్ర వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడల్లో దాదాపు 20 జట్లు పాల్గొన్నాయి. మంత్రాలయం ముండలం సూగూరు జట్టు విజేతగా నిలిచి మొదటి బహుమతి రూ 40,016 నగదు అందుకుంది.తరువాతి స్థానాల్లో నిలిచిన అనంతపురం జిల్లా డిఫెన్స్ సోల్జర్స్ జట్టు రూ 30,016, సూగూరు జట్టు రూ.20,016, గుంతకల్లు జట్టు రూ 10,016, దేవనకొండ జట్టు రూ 8,016 దక్కించుకున్నాయి. ఎస్ఐ భూపాలుడు, ఎంపీపీ లక్ష్మీదేవి, మండల కన్వీనర్ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు.

యూజీడీ పనుల పూర్తికి చర్యలు



పట్టణంలో యూజీడీ నిర్మాణంపై ఎస్ఈకి వివరిస్తున్న అధికారులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో చివరి దశలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) నిర్మాణ పనులను సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పబ్లిక్ అండ్ హెల్త్ శాఖ ఎస్ఈ శ్రీనాథ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం పట్టణంలోని గుడికల్ రోడ్డులోని పంప్ హౌస్ వద్ద ఏఐఐబీ వాటర్ స్కీంతో పాటు యూజీడీ పనులు, సోగనూరు రోడ్డులో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఇప్పటివరకు చేపట్టిన యూజీడీ పనులను అధికారులు ఆయనకు వివరించారు. పనులు పూర్తి చేసి యూజీడీని పట్టణ వాసులకు అందుబాటులోకి తేవాలని ఆయన అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, పబ్లిక్ అండ్ హెల్త్ ఈఈ చంద్రమోహన్ రెడ్డి, డీఈ వెంకటేశ్వర్లు, మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఏపీకి పెట్టుబడుల వెల్లువ



సంబరాల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం రూరల్: విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్‌లో ఏపీకి ఎన్నడూ లేని విధంగా పెట్టుబడులు వెల్లువలా వచ్చాయని వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని దుర్గారమణ కల్యాణ మండపంలో ఏపీకి రూ 13.41 లక్షల కోట్ల పెట్టుబడి, 378 కీలక ఒప్పందాలు, 6 లక్షల మంది యువతికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావడంతో వైఎస్సార్‌సీపీ నేతలు వై.ప్రదీప్‌రెడ్డి, కుమారస్వామి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలనలో చంద్రబాబునాయుడు హడావుడి తప్పా అభివృధి ఏమి జరగలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన మెచ్చి పెట్టుబడుదారులే నేరుగా ఏపీకి వచ్చి పెట్టుబడులు పెట్టడం సంతోషకరమన్నారు.

శేష వాహనంపై శ్రీరంగనాథుడు



శేషవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథుడు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో కొలువుతీరిన శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి సతీసమేతుడై సోమవారం శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. శ్రీరంగనాథుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శేషోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తుల మధ్య పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు వేదమంత్రాలు చదువుతూ పూజలు చేశారు. వైకుంఠంలో శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవి సతీసమేతంగా శేషవాహనంపై కొలువుంటాడని ఈ దర్శన భాగ్యం ప్రతి ఒక్కరికీ దక్కుతుందన్నారు. అనంతరం స్వామి వారిని శేష వాహనంపై కొలువుంచి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఖాదర్ వలి

కర్నూలు(అగ్రికల్చర్): 'సిరిధాన్యాలను నిర్లక్ష్యం చేయవద్దు.. నేడు వీటి ద్వారానే మానవాళికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని' పద్మశ్రీ అవార్డు గ్రహీత, మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. సిరి ధాన్యాల ఆహారం తీసుకుంటే ఆరు నెలల నుంచి 2 ఏళ్లలో వారి వ్యాధులను పూర్తిగా నివారించుకోవడం సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. డాక్టర్ ఖాదర్‌వలికి కేంద్రం పద్మశ్రీ అవార్డును ప్రదానం చేసిన నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సాయంత్రం 6 గంటలకు స్కందాన్షి గ్రూపు ఆధ్వర్యంలోని దేశీ న్యూట్రీ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్‌వలిని స్కందాన్షి గ్రూపు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఘనంగా సత్కరించారు. సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం అనే అంశంపై చేసిన ప్రసంగం విశేషంగా ఆకట్టుకుంది. రాష్ట్రంలో కూడా సిరి ధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నెలవారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై షెడ్యూలు ప్రకటించిందని తెలిపారు. సిరిధాన్యాల ద్వారా షుగర్, బీపీ, థైరాయిడ్, ఒబేసిటీ, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పి.ఎల్.వరలక్ష్మి, డీఎస్పీ సీతారాములు తదితరులు పాల్గొన్నారు.